# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

### ❖ కాంగ్రెసోళ్లకు తెలివి లేదు

తాండూర్, నవంబర్ 25 : కాంగ్రెసోళ్లు తెలిసి మాట్లాడుతున్నరో.. తెల్వక మాట్లాడుతున్నరో అర్థమైతలేదు. ఎవుసానికి 3 గంటల కరెంట్ చాలు అనేందుకు సిగ్గుండాలే. 58 ఏండ్లు ఆంధ్ర పార్టీల పెత్తనంలో తెలంగాణ ఎంతో గోస పడ్డది. ఇప్పుడిప్పుడే మంచిగైతున్నం. కాంగ్రెస్ గెలిచేది లేదు. సచ్చేది లేదు. నాలుగు ఓట్లు రానోళ్లు కూడా మాట్లాడబట్టే. మళ్లీ కరెంట్ 3 గంటలు ఇస్తమని అనడం సిగ్గు చేటు. స్వరాష్ట్రంలో రైతు ఎదుగుతున్నడు. దానికి సీఎం కేసీఆర్ సార్ ఎంతో కృషి చేస్తుండు. 24 గంటల కరెంట్‌తో హాయిగా ఎవుసం చేసుకుంటున్నం. మరో పక్క సాగు, తాగునీరు ఇస్తుండు. అన్నదాతల సంక్షేమానికి పాటుపడుతుండు. ఇంకేం కావాలే మాకు. కాంగ్రెసోళ్ల మాటలన్నీ చూసిన తర్వాత మాకు మళ్లీ బీఆర్ఎస్‌కు ఓటు వేయాలనిపిస్తుంది. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తేనే రైతులందరికీ మంచి జరుగుతుంది. అందుకే కారుకే ఓటేస్తాం.. కేసీఆర్‌నే గెలిపిస్తం.

**- ఇప్ప దేవదాసు, రైతు, ద్వారకాపూర్, తాండూర్**



### ❖ ఎవుసం మంచిగైంది..

చెన్నూర్ రూరల్, నవంబర్ 24 : తెలంగాణ వచ్చినంక ఎవుసం మంచిగైంది. సీఎం కేసీఆర్ చెరువులను మంచిగ చేయించి పుష్కలంగా నీళ్లు తీసుకొచ్చిండు. 24 గంటల కరెంటిస్తుండు. రైతుబంధు, రైతుబీమా అమలు చేస్తుండు. రైతులందరం రంది లేకుంట రెండు పంటలు పండించుకుంటున్నం. గదే కాంగ్రెస్ గవర్నమెంట్ ఉన్నప్పుడు మా నాన్న ఎవుసం కోసం అష్టకష్టాలు పడేటోడు. కరెంట్ ఉంటే.. నీళ్లు.. నీళ్లుంటే కరెంట్ ఉండకపోయేది. రాత్రీ పగలూ పొలాల పొటే తిరిగేటోడు. యేటా ఒకటే పంట తీసేటోళ్లు. ఇప్పుడు మళ్లా కాంగ్రెస్‌ను నమ్మితే అరిగోస తప్పదు. గా పార్టీని దగ్గరకు రానీయం.. మళ్లోసారి బీఆర్ఎస్‌నే గెలిపించుకుంటం.

**- తుపాకుల సంతోష్, యువ రైతు సుబ్బరాంపల్లి**



### ❖ ధరణి రద్దు చేస్తే ఇబ్బందులు

వేమనపల్లి, నవంబర్ 25 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌ను ఎత్తివేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పడం సరికాదు. గతంలో రైతులు భూములను పట్టా చేసుకోవాలంటే కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరిగేవాళ్లం. రైతులు ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లు. కేసీఆర్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ ఎంతో బాగుంది. త్వరగా భూముల పట్టాలు జరుగుతున్నాయి. మీసేవలో స్లాట్ బుక్ చేసుకొని స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన వెంటనే పట్టా పూర్తవుతుంది. దీంతో రైతుల కష్టాలు తొలగిపోయాయి. దళారుల బెడద లేకుండా పట్టాలు రైతుల పేరు మీద అవుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీతో రైతులు, ప్రజలకు మేలు జరుగుతుంది. మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలి. కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలి.

**- దాసరి పోచయ్య, రైతు, జిల్లెడ**



### ❖ రేవంత్ మాటలు నమ్మితే ఆగమే

జైపూర్, నవంబర్ 25 : పూటకో మాట మాట్లాడే రేవంత్ రెడ్డి మాటలు నమ్మితే ఆగమవుడే. అసలు గెలుస్తడో, గెలువడో ఆయనకే తెలియదు. ఇగ ధరణి ఎట్ల తీసేస్తడు. ధరణి రాక ముందు పహణీ కోసం పట్వారీ చుట్టూ తిరిగేటోళ్లు. ఇప్పుడా పరిస్థితి లేదు. మీసేవకు పోతే నిమిషాల్లో ప్రింట్ తీసి ఇస్తున్నరు. అప్పుడు లంచం ఇస్తేనే పహణీ, 1బీలో రాసేటోళ్లు. ధరణి తీసేస్తే అలాంటి కష్టాలు మళ్లా మొదలైతయ్. పట్వారీ వ్యవస్థంటేనే భయమైతంది. భూ రికార్డులో పేర్లు మాయమవుతయ్. పలుకుబడి ఉన్నోళ్లు పేర్లు ఎక్కించుకుంటరు. దొంగ సర్వే నంబర్లు పుట్టుకొస్తయ్. కేసీఆర్ సర్కారు తెచ్చిన ధరణి మంచిగానే ఉన్నది.

**- మాదాసు శంకర్, ఇందారం**



### ❖ కాంగ్రెస్‌ను నమ్మితే నిండా మునుగుడే..

తాండూర్, నవంబర్ 25 : సీఎం కేసీఆర్ రైతుల మేలు కోరి 24 గంటలపాటు కరెంట్ ఇస్తుండు. 10 ఏండ్ల కింద కరెంట్‌తో మస్తు కష్టాలు పడ్డాం. నాడు కరెంట్ ఎప్పుడొస్తుందో తెలియక రాత్రంతా పొలం దగ్గర పడుకున్న దినాలు చాలానే ఉన్నాయి. సీఎం కేసీఆర్ అందిస్తున్న 24 గంటల కరెంట్‌తో నాకు వీలైనప్పుడు మోటరు ఆన్ చేసి పారగానే ఇంత పొద్దు ఉండగానే ఇంటికి చేరుతున్న. కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంట్ అయితే పొలానికి సరిపోతుందని ఏతులు మాట్లాడుతుర్రు. 10 హెచ్ మోటర్లని అంటుండ్రు. బోర్లలో పెడితే ఒక్కసారి గుంజి పోస్తే నీళ్లు అందవు. కరెంట్ కూడా ఎక్కువ కాల్తది. నీళ్లు అందకపోతే మోటార్లు కాలుతాయి. ఇప్పుడు 24 గంటల కరెంట్‌తోనే రంది లేకుండా ఉన్నాం. కాంగ్రెసోళ్ల మాటలు వింటే నిండా మునుగుతాం. **- మడె చిలుకయ్య, రైతు, కత్తెర్ల**



# 3 గంటల కరెంటొద్దు.. 10 హెచ్‌పీ మోటర్లొద్దు..

**కర్షకులపై కక్ష గట్టిన కాంగ్రెస్ పార్టీ నాయకులు**

- **మళ్లీ గోస పడడానికి సిద్ధంగా లేమని రైతుల మండిపాటు**
- **హస్తం గుర్తుకు అవకాశమిస్తే షాక్ తగలడం ఖాయమని వెల్లడి**

***కరెంట్ కోతలు పెడుతమని,*** *కక్ష కట్టిన కాంగ్రెస్‌పై కర్షకలోకం కన్నెర జేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో కరెంట్ కోతలతో అరిగోసపడ్డమని, చేల వద్ద నీటి పారుకం పెట్టడానికి కరెంటు కోసం ఎదురుచూస్తూ ఏనాడు కంటి నిండా నిద్రపోలేదని, ఇప్పుడు అది తలచుకుంటనే భయమైతుందంటున్నారు. ఎవుసానికి 24 గంటలు దండగ.. మూడు గంటల కరెంట్‌తో మస్తుగా ఎవుసం చేసుకోవచ్చు అంటున్నారని.. గట్లైతే పారినమడే మళ్ల పారుతది. పొలం మొత్తం నీళ్లు అందవంటున్నరు. 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకునేందుకు మస్తు పైసలైతయని, అది పెడితే నెల రోజుల్లోనే బోర్లు, బావులు అడుగంటి పోతాయంటున్నరు. రైతులను ముంచే ముచ్చట కాంగ్రెస్ పార్టీ బంద్ పెట్టాలంటున్నరు. ఎప్పడేం చేయాలో.. వ్యవసాయం ఎట్లా చేయాలే మాకు తెలుసునంటున్నారు. పొరపాటున వాళ్లకు ఓటేస్తే మాకు కరెంట్ షాక్ తగలడం ఖాయమని హెచ్చరిస్తున్నరు. మూడు గంటల కరెంటొద్దు.. 10 హెచ్‌పీ మోటార్లు వొద్దు.. కాంగ్రెస్ కటిక చీకట్లు అసలే వొద్దు.. రేవంత్‌రెడ్డి దోపిడీ మా కొద్దు అని తేల్చిచెప్తున్నరు. రైతులకు ఇప్పుడు వస్తున్న 24 గంటల కరెంటే బాగుందని, మరోసారి సీఎంగా కేసీఆర్‌ను చేసుకోవాలని చెప్తున్నరు.*

**- మంచిర్యాల, నవంబర్ 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి)**

### ❖ కాంగ్రెసోడు వచ్చుడు వద్దు



భీమారం, నవంబర్ 25 : మూడు గంటలు వద్దు.. కాంగ్రెసోడు వచ్చుడు వద్దు. యేండ్లకేండ్లు పాలించి నరకం చూపినోళ్లు.. ఇప్పుడచ్చి ఏది పడితే అది మాట్లాడుతున్నరు. కరెంట్ కోసం పొలాల కాడ పన్న రోజులు ఇంకా మరిచి పోలేదు. కాంగ్రెస్సోనికి ఏమైనా సోయి ఉందా.. ఎవుసానికి 3 గంటల కరెంటే చాలు అంటున్నడు. గా కరెంట్‌తో ఎకరం పొలం అయినా తడుస్తదా. కాంగ్రెసోనికి తెలివి లేదు. తెలివి లేకనే వంకర మాటలు మాట్లాడుతున్నడు. నోటికి ఏదొస్తే అది అంటే నడువదు. ఇప్పుడున్న 24 గంటల కరెంట్‌తో రంది లేకుంట ఎవుసం చేస్తున్నం. నువ్వచ్చి అది చేస్తా.. ఇది చేస్తా అంటే నమ్మే పరిస్థితి లేదు. **- భూక్యా రమేశ్‌నాయక్, రైతు, బూర్గుపల్లి**

### ❖ మోసం చేయాలని చూస్తున్రు



కోటపల్లి, నవంబర్ 25 : రైతులకు మూడు గంటల కరెంట్ చాలని, 24 గంటల విద్యుత్ అవసరం లేదని కాంగ్రెసోళ్లు మాట్లాడడం చూస్తే వారికి ఎవుసంపై ఎలాంటి అవగాహన లేదని తెలుస్తున్నది. 10 హెచ్‌పీ మోటర్లు బోర్లకు ఎవరైనా వాడుతారా... బోర్ల నుంచి ఊరే నీరు 5హెచ్‌పీ మోటర్లకే సరిపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ఎందుకు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటరు. కాలువలు, చెరువుల నుంచి నీటిని తోడడానికే 10 హెచ్‌పీ మోటర్లు వాడుతరు. ఆ మోటరు ధర కూడా ఎక్కువే. పైర్ల సాగుకు చిన్న మోటర్లే సరిపోతున్నప్పుడు 10హెచ్‌పీ మోటర్లు ఎందుకు వాడాలి? కాంగ్రెసోళ్ల మాటలు రైతులను మోసం చేసేలా ఉన్నాయి. వారిని నమ్మే పరిస్థితిలో లేము. రైతుల పక్షాన నిలబడుతూ, రైతుల సంక్షేమం కోసం పాటుపడుతున్న కేసీఆర్ సార్ వెంటే మా తెలంగాణ రైతాంగం ఉంటుంది. ఎవ్వరెన్ని ముచ్చట్లు చెప్పినా కేసీఆర్ సారే మాకు కావాలి. **- ఇందూరి మహేశ్, కొండంపేట**

### ❖ నమ్మం.. మోసపోం..



నెన్నెల, నవంబర్ 25 : మూడు గంటల కరెంటు ఇస్తామంటున్న కాంగ్రెసోళ్లు 10 హెచ్‌పీ మోటర్ ఎట్ల నడుస్తదో వచ్చి చూపించాలి. పైగా గా మోటర్ పెట్టుకుంటే రూ. లక్షకుపైగా ఖర్చయితదట. గా పైసలెవ్వడిస్తడు. ఇగ మూడు గంటల కరెంటంటున్నడు. గట్లయితే ఎవుసం చేయలేం. తెలంగాణ ప్రభుత్వం 24 గంటలపాటు నాణ్యమైన కరెంటు ఇస్తున్నది. మేం 5 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని మంచిగా పంటలు పండించుకుంటున్నం. లోవోల్టేజీ సమస్య లేదు. రేవంత్ రెడ్డి అన్నట్లు 10 హెచ్‌పీ మోటర్లు పెడితే.. ఎకరం పారే లోపే నీళ్లయిపోతయ్. మళ్ల ఊరి పారిస్తే మళ్ల అదే ఎకురం తడుస్తది. ఇంకా రైతులందరు పెద్ద మోటర్లు వాడితే ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడుతుంది. స్టార్టర్, మోటర్ కాలిపోయే ప్రమాదం ఉంటుంది. అట్లోంటి కాంగ్రెస్ మాకు అవసరం లేదు. వాళ్లను నమ్ముడద్దు.. మోసపోవద్దు. **- తోట మధూకర్, నెన్నెల**

### ❖ కాంగ్రెస్సోళ్లకు సోయి ఉందా..?

తాండూర్, నవంబర్ 25 : అసలు కాంగ్రెస్సోళ్లకు సోయి ఉందా? ఎవుసం గురించి ఏమైనా తెలుసా..? ఓ మడికి ఎన్ని నీళ్లు పడుతాయో..? ఎన్ని గంటల కరెంటు కావాలో..? తెలవనట్లు ఉంది. నేను ఎవసం చేయబట్టి 30 ఏండ్లు పైనే గప్పుడు కరెంటు ఎప్పుడొస్తదో.. ఎప్పుడు పోతదో తెలువదు.. లోవోల్టేజీతో వచ్చే కరెంట్‌తో మోటర్లు కాలిపోయేవి. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే. దాని కింద ఉన్న ఎవుసాయ బావుల వాళ్లమంతా చందాలు వసూలు చేసుకుని రిపేర్ చేయించేటోళ్లం. గా కష్టాలు తలుచుకుంటేనే వణుకు పుడుతది. సీఎం కేసీఆర్ చొరవతో విద్యుత్ సమస్య లేదు. మూడు గంటల కరెంట్‌తో ఏ ఒక్కమడికి సరిపడా నీళ్లు అందివ్వలేం. కాంగ్రెసోళ్లు ఎన్ని చెప్పినా గెలవరు వాళ్లను నమ్మి ఆగం కావద్దు.

**- చంద్రగిరి మల్లయ్య, రైతు, ద్వారకాపూర్, తాండూర్**



### ❖ ఎద్దెవుసం తెల్వనోడు రేవంత్

తాండూర్, నవంబర్ 25 : కాంగ్రెసోడు గెలిచేది లేదు..సచ్చేది లేదు.. నాలుగు ఓట్లు రానోడు కూడా మాట్లాడబట్టే. ఎవుసం మీద గడికోమాట మాట్లడుతడు.. అసలు రేవంత్‌కు ఎద్దెవుసం అంటే ఏందో తెలుసా.. రైతులంటే చులకనా..ఓసారి రైతులకు మూడు గంటల కరెంటు చాలంటడు.. ఇంకోసారి 10హెచ్‌పీ మోటర్లంటడు. కాంగ్రెస్ వస్తే ఆయనిచ్చే మూడు గంటల కరెంటుకు తీగల మీద చద్దర్లు ఆరేయాల్సిందే. ఇప్పుడు రైతులు సుఖంగా ఉన్నార్రా నాయనా.. మమ్మల్ని బాయిలదోయకు. ఇప్పుడిప్పుడే తెలంగాణలో నీళ్లు పుష్కలమైనయ్. కరెంటు దినాం ఉంటుంది. బోర్లు పోస్తున్నయ్. ఇంకేం కావాలే రైతుకు. 10 హెచ్‌పీ మోటర్ పెడితే ఖర్చు తడిసి మోపెడైతది. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయ్. మమ్మల్ని ఉన్నదున్నట్టు బతుకనియ్ రేవంత్‌రెడ్డి.

**- దుర్గం మల్లేశ్, రైతు, మాదారం త్రీ ఇంక్లైన్, తాండూర్**



### ❖ 3 గంటల కరెంటుతోటి సాగు ఎట్ల జేసుడు.

లక్షెట్టిపేట, నవంబర్ 25 : మూడు గంటల కరెంట్ ఇత్తే సాగు ఎట్ల జేసుడో రేవంతు రెడ్డే జెప్పాలె. 50 ఏండ్లు కాంగ్రెస్ పార్టీ ఏలినప్పుడు ఎన్ని గంటల కరెంటు ఇచ్చిన్రు. వాళ్లు మంచిగ ఇస్తే మా బతుకులు ఇప్పుడు గిట్ల ఉండేటియా. కాంగ్రెస్ పార్టీ పాలన చెయ్యవట్టే మా కుటుంబాలు రోడ్డున పడ్డయ్. మా తాతలు తండ్రులు భూమి జాగలున్న కూడా బిచ్చగాళ్లు అయిన్రు. మా బతుకులు కూడా అలానే ఉండుకచ్చినయ్. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినంక మా బతుకుల్లో వెలుగులు నిండి, మా కుటుంబాలు సంతోషంగా ఉంటున్నయ్. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు నీళ్లు, కరెంటు లేకపాయె. ఇప్పుడు 24గంటల కరెంటు, పొలాల సుట్టూ నీళ్లు, పండించుకున్నంత పంట. మళ్లా కాంగ్రెసోళ్లు అచ్చి 3 గంటల కరెంటు ఇచ్చి మా కొంపలు ముంచుదామనే కదా ఆలోచన. అది జరగనిచ్చే ప్రసక్తే లేదు. **- ఆవునూరి రవి, పత్తి రైతు, లక్షెట్టిపేట**



# ధరణి ఎత్తేస్తే విధ్వంసమే..

**పాత పద్ధతొస్తే పల్లెల్లో నిత్యం భూ తగాదాలే..**

- **కాంగ్రెసోళ్ల భూమాత పోర్టల్ సంపాదించుకోవడానికేనా..**
- **సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణే బాగుందంటున్న రైతులు**

***తెలంగాణ వ్యవసాయ రంగంలో*** *విధ్వంసం సృష్టించేందుకు కాంగ్రెస్ కత్తులు నూరుతున్నది. ధరణిని రద్దు చేసి రాక్షస ఆనందం పొందాలని చూస్తున్నది. అది రైతులకు చేసే మంచి వాళ్లకేం ఎరుకైతలేదు. గిప్పడు మా భూముల్ల ఎట్లాండి ఇబ్బంది లేదు. టైమ్‌కు రైతు బంధు పడుతాంది. టైమ్‌కు విత్తనాలు, ఎరువులు అందుతున్నయ్. పండిన పంటను కొనుగోలు కూడా చేస్తున్నరు. గివన్నీ కాంగ్రెసోళ్లు ఉన్నప్పడే యాడున్నయ్. ఇప్పడు అన్ని అచ్చినయ్. కాంగ్రెసోళ్లు ఉన్నప్పడు ఇయ్య చేతగానోళ్లు గిప్పడొచ్చి.. ధరణిని రద్దు చేస్తాం.. భూముల్లో పంచాయితీలు పెడతాం. అధికారులకు రికార్డు లు రాసే అధికారం ఇస్తాం. కౌలుదారుకాలం పెట్టి మళ్ల గోస పెడ తాం అని చెప్తున్న కాంగ్రెసోళ్ల మాటలకు భయమైతాంది. మళ్ల పాత రోజులు వత్తయంటే ఊరుకుంటమా.. వచ్చేటోళ్లను తరమికొట్టం.. ఎరువులు, విత్తనాలు లైన్లు కట్టే రోజులు.. మా భూమిని ఇంకొని పేరు మీద రాసి కోర్టుల చుట్టూ, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పే రోజులు మాకొద్దు.. అని రైతులు మండిపడుతున్నారు. పూటకో మాట.. రోజుకో ముచ్చట మారుస్తున్న కాంగ్రెస్‌తో ఎన్నటికున్నా డేంజరే అంటున్నరు. ఇప్పుడున్న వ్యవస్థే మంచిగ ఉన్నదని, మా భూము లు మాకు ఉన్నయని చెప్తున్నరు. ఇది గిట్లనే ఉండాలంటే మరోసారి బీఆర్ఎస్ సర్కార్ రావాలని ముక్తకంఠంతో నినదిస్తున్నరు.*

**- మంచిర్యాల, నవంబర్ 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి)**

### ❖ భూ మాత ప్రకటనతో భయం



హాజీపూర్, నవంబర్ 25 : కాంగ్రెస్ పార్టీ అధికారంలకు వస్తే ధరణి పోర్టల్ స్థానంలో భూ మాత పోర్టల్ తీసుకవస్తామని ఆ నాయకులు ప్రకటన చేయడం ఆందోళన కలిగించేదిగా ఉంది. మళ్లా పాత రోజులు గుర్తుకు వస్తున్నయ్. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందేమోనని రైతులు ఆలోచనలో పడ్డారు. ధరణి పోర్టల్ విధానంతో మా భూములకు సంబంధించిన రికార్డులు భద్రంగా ఉన్నయ్. భూ మాత పోర్టల్ పేరుతో కౌలు, అనుభవధారుల కాలం ఏర్పాటు చేసి రికార్డులు తారుమారు చేస్తారేమోనని భయంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ మా భూములకు శ్రీరామ రక్షగా ఉంది.

**- బాసవేణి ఐలయ్య, టీకన్నపల్లె, హాజీపూర్ మండలం**

### ❖ కాంగ్రెస్ నమ్మితే ఆగమే



కన్నెపల్లి, నవంబర్ 25 : తెలంగాణ రాకముందు ఉన్న పట్వారీ వ్యవస్థతో మస్తు ఇబ్బందులు పడ్డం. పహణీ కావాలంటే వారి చేయి తడపనిదే వివరాలు ఇచ్చే వారు కాదు. చాలా మంది రైతులు రికార్డులు కావలన్నా.. మ్యుటేషన్ కావాలన్నా పనులు వదిలి పెట్టి తహసీల్ ఆఫీసు చుట్టూ తిరిగేది. పైరవీకారుల చేతిలో నష్టపోయేటోళ్లం. కాంగ్రెసోళ్లు ధరణి తీసేసి భూమాత తీసుకొస్తాం అంటున్రు. అట్లయితే ఎవరీ భూమి ఎక్కడ ఉంటుందో తెల్వది. రైతులను మళ్లీ బిచ్చగాళ్లను చేసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతున్నది. వాళ్ల పాలనలో భూమి రిజిస్ట్రేషన్‌కు పొద్దున పోతే సాయంత్రం వచ్చేటోళ్లం. ఇప్పుడు ఎమ్మార్వో ఆఫీసులోనే 20 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ధరణితో అక్రమాలకు అస్కారం లేకుండా అయింది. కాంగ్రెసోళ్లను నమ్మితే రైతులు ఆగమే. ధరణి పోర్టల్‌ను తీసేస్తమని అంటున్న కాంగ్రెస్‌ను రైతులంతా ఏకమై బంగాళాఖాతంతో కలుపుతం. బీఆర్ఎస్ ప్రభుత్వమే రాష్ట్రంలో అధికారంలోకి రావాలి.

**- తాళ్లపల్లి శ్రీకాంత్, జజ్జరవెల్లి**

### ❖ దరణి తీసేత్తె మళ్లీ దళారులే రాజ్యమేలుతరు.



లక్షెట్టిపేట, నవంబర్ 25 : ధరణి పోర్టల్ తీసేత్తె మళ్లా దళారులే రాజ్యమేలుతరు. కాంగ్రెస్ హయాంల రైతుల బతుకులు మొత్తం వీఆర్వోల చేతిల ఉండేటియి. ఏ పని కావాలన్నా వీఆర్వోల చుట్టూ, తాసిల్దార్ ఆఫీస్ చుట్టూ తిరుగుడు. వాళ్లకు లంచాలు ఇచ్చుడు. అప్పట్ల భూ అమ్మకాలు జరిపినా, కొనుగోళ్లు జరిపినా ఎకరాలకు ఎకరాలు తప్పుడు రాసేటోళ్లు. వాటిని దిద్దిపియ్యాలంటే వాళ్ల తప్పుకు కూడా మనకే పొక్క పడేది. అలా ఒక్కో వీఆర్వోలు లక్షలు, కోట్లు సంపాధించుకున్నరు. వాళ్ల అవినీతి చూసే తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు అయినంక మన సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ తీసుకువచ్చి, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించిండు. ఇక రైతుల భూముల్లో ఎవ్వడూ చెయ్యి పెట్టకుండా, ఎవ్వడు కబ్జా చేయకుండా ఆ కాలం కూడా తీసేసి పుణ్యం కట్టుకున్నడు. మళ్లా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు వచ్చి ధరణి తీసేసి, రైతుల కొంపలు ముంచుదామని చూస్తున్రు. అది జరిగే పనికాదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించే ప్రసక్తే లేదు. తెలంగాణ రాష్ట్రం రైతులది. బీఆర్ఎస్ పార్టీ రైతులది. **- నుళిగొండ కృష్ణ, బలరావుపేట, లక్షెట్టిపేట మండలం**



### ❖ ప్రజలే బుద్ధి చెబుతరు..

మందమర్రి రూరల్, నవంబరు 25 : తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణిని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే తీసేస్తమంటుర్రు. ధరణిని తీసేస్తే మళ్లీ రైతులకు ఇబ్బందులు తప్పవు.గత ప్రభుత్వాల హయాంలో భూ సమస్యల పరిష్కారం కోసం నెలలో వారం రోజులు తహసీల్ కార్యాలయం చుట్టూ తిరిగినా పని అయ్యేది కాదు. ఎవరి భూమి ఎవరికి ఎక్కిస్తరో తెల్వదు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని తీసేస్తరు అంటుర్రు. అది వింటేనే భయమేస్తుంది. భూములు విక్రయించాలన్నా.. కొనాలన్నా అధికారులు, పైరవీకారులదే పెత్తనం నడుస్తది. పైసలు ఇచ్చినోళ్లకు మాత్రమే పని అయితది. భూమి కొన్నా రికార్డులకు పేరు ఎక్కుతదో లేదో తెల్వదు.ఎవరి భూమి ఎవరికి ఎక్కిస్తరో చెప్పరు. గతంలో భూ రికార్డులు తప్పుల తడకలు ఉన్నాయి. పాస్ బుక్కు రావాలన్నా పైసలు ఇయ్యాల్సి వచ్చేది. కానీ తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ భూముల లెక్కలు పక్కాగా చేశారు. భూ క్రయవిక్రయాలు అరగంటలో అయిపోయి పాస్ బుక్ వస్తుంది. రిజిస్ట్రేషన్లో పైరవీ కారులు, నాయకుల అవసరం లేదు. ధరణితో కొత్త పాసుబుక్ వచ్చి నిమ్మలంగా ఉంటుంది. ధరణిని తీసేస్తామంటున్న కాంగ్రెస్ ప్రజలే బుద్ధిచెబుతారు. **- కోడూరి కృష్ణ , రైతు, ఊరు రామకృష్ణాపూర్, మందమర్రి**

